క్లుప్తంగా

ట్రాఫిక్‌తో ఇక్కట్లు



మండల కేంద్రంలో నిలిచిన వాహనాలు

రామభద్రపురం: మండల కేంద్రం నాలుగు రాష్ట్రాల కూడలి కావడంతో నిత్యం ట్రాఫిక్ స్తంభించిపోతోంది. సంక్రాంతి నేపథ్యంలో అన్ని ప్రాంతాల నుంచి ప్రజలు స్వగ్రామాలకు వస్తుండడంతో మండల కేంద్రంలో ఆదివారం ట్రాఫిక్ నిలిచిపోయింది. అధిక సంఖ్యలో వాహనాలు నిలిచిపోవడంతో విషయం తెలుసుకున్న ఎస్సై జ్ఞాన ప్రసాద్ సిబ్బందితో చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. రహదారి ఇరుకు కావడంతో ఎప్పటికప్పుడు ట్రాఫిక్ స్తంభించిపోతోందని, రహదారులను వెడల్పు చేసి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

మంచు దుప్పటి..



తెర్లాం-బొబ్బిలి రోడ్డులో లైట్లు వేసుకుని వస్తున్న లారీ

తెర్లాం: మండల కేంద్రంలో ఆదివారం తెల్లవారుజాము నుంచి మంచు దట్టంగా కురిసింది. ఉదయం ఏడున్నర గంటల వరకు విపరీతమైన మంచు కురవడంతో వాహన చోదకులు లైట్లు వేసుకుని మరీ రాకపోకలు సాగించాల్సి వచ్చింది. ఈ మంచు వల్ల మామిడి, జీడి మామిడి పూత మాడిపోయే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

బొత్స ఝాన్సీని కలిసిన ఎమ్మెల్యే శంబంగి



బొత్స ఝాన్సీతో ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థిగా బొత్స ఝాన్సీలక్ష్మిని ప్రకటించిన నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఆదివారం ఆమెను కలిసి అభినందనలు తెలియజేశారు. ఎన్నికల్లో తప్పకుండా విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

ఎస్సైగా జనార్దననాయుడు



వంగర: స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్సైగా వై.వి. జనార్దననాయుడు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై ఆర్.జనార్దనరావు బదిలీపై వెళ్లడంతో కొత్తవలస పోలీస్ స్టేషన్ ఎస్సైగా పనిచేస్తున్న జనార్దననాయుడు ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది సహకారంతో మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేస్తానన్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షతలు



ఆమిటిలో అక్షతలు పంపిణీ చేస్తున్న దృశ్యం

తెర్లాం: మండలంలోని ఆమిటి గ్రామంలో అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముని అక్షతలను ఆదివారం స్థానిక పురోహితులు, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. పురోహితులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మార్కెట్‌కు సంక్రాంతి శోభ

సంతకవిటి: సంక్రాంతి పండగకు కావాల్సిన సరుకుల కొనుగోలుతో మార్కెట్లు కళకళలాడాయి. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన ప్రజలతో మండల కేంద్రంలోని మార్కెట్ కిటకిటలాడుతూ కనిపించింది.



తెర్లాం: వెలగవలసలో భోగి మంట చుట్టూ చేరిన గ్రామస్తులు



రాజాం సిటీ: మారుతీనగర్ భోగిమంట వద్ద స్థానికులు



బొబ్బిలి: పక్కిలో భోగి మంట వద్ద ఎమ్మెల్యే శంబంగి సోదరులు



వంగర: అరసాడలో వేసిన భోగిమంట

ఆనందాల భోగి..

కష్టాలన్నీ భోగి మంటలతో పోయి సంక్రాంతి నుంచి సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ వాడవాడలా భోగి పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. సూర్యుడు దక్షిణాయణంలో ఉండే చివరి రోజే భోగి పండుగ. ఈ రోజున చలి తీవ్రస్థాయిలో ఉంటుంది కాబట్టే భోగి మంటలు వాతావరణంలో కాస్త వెచ్చదనాన్ని నింపుతాయి. గ్రామాలు, పట్టణాల్లో చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ వేకువజామునే నిద్ర లేచి స్నానపానాదులు పూర్తి చేసుకుని భోగి మంటలు వేశారు. చిన్నారులు కొత్త దుస్తులు ధరించి, ఆవుపేడతో చేసిన పిడకలు మంటలో వేసి సందడిగా గడిపారు.

– బొబ్బిలి/రాజాం నెట్‌వర్క్



సంతకవిటి: సత్యసాయి బాబా మందిరం వద్ద భోగిమంట వెలిగించి భజన చేస్తున్న సాయి భక్తులు



బాడంగి: భోగి మంట కాగుతున్న యువకులు



రేగిడి: వన్నలిలో భోగిమంట వేస్తున్న గ్రామస్తులు



రామభద్రపురం: మండల కేంద్రంలో భోగి పిడకలు తీసుకెళ్తున్న చిన్నారులు



రాజాం: వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో భోగి పండగ సందడి



రామభద్రపురం: భోగిమంట కాగుతున్న యువత

పేదలకు నూతన వస్త్రాల పంపిణీ



రాజాం: పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న కృష్ణార్జున

రాజాం: మండలంలోని కంచరాం గ్రామంలో శిష్టకరణ బీసీ సాధన కమిటీ అధ్యక్షుడు ఏవీ జగన్నాథరావు పట్నాయక్ స్మృతి వనం వద్ద వెయ్యి మంది పేదలకు ఆదివారం నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. జేఎల్‌కే టైల్స్ ఎండీ ఏవీఎస్ఎస్ కృష్ణార్జున తన తండ్రి ఏవీ జగన్నాథరావు పట్నాయక్ జ్ఞాపకార్థం వీటిని పంపిణీ చేశారు. అంతకుముందు స్మృతివనం వద్ద సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల నృత్యాలు, గాలిపటాలు ఎగరవేయడం, తదితర కార్యక్రమాలతో ప్రాంగణం సందడిగా కనిపించింది. కార్యక్రమంలో ఏవీ రమణమ్మ, ఏవీ లీలాకుమారి, ప్రియాంక, మురారి, లీలావాసంతి, ఉరటి గోపాలారావు, శ్రీనివాసరావు, ఆమిటి రాజేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పొట్నూరు లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి పొనుగుటివలస గ్రామంలో అదే గ్రామానికి చెందిన విశ్రాంత వ్యవసాయాధికారి శాసపు వెంకటరమణ ఆదివారం 300 మంది వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు దుస్తులు పంపిణీ చేశారు. తన తండ్రి సూరపునాయుడు జ్ఞాపకార్థం ఏటా సంక్రాంతి పండగకు పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శాసపు భవానీ, శాసపు ప్రసాదరావు, గార వెంకటేష్, శాసపు జగదీష్, శాసపు సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.



రాజాం సిటీ: వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎస్‌వీ రమణ, తదితరులు

నిత్యావసర సరుకుల పంపిణీ

వంగర: మండలంలోని కొప్పరవలస గ్రామంలో నిరుపేదలకు శ్రీసత్యసాయి సేవాసమితి సభ్యులు అమృత కలశం పేరుతో నిత్యావసర సరుకులు ఆదివారం పంపిణీ చేశారు. ఇప్పటికే నిత్యాన్నదాన కార్యక్రమంలో భాగంగా పలువురు పేదలకు భోజన క్యారేజీలు అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

తెర్లాం: మండలంలోని విజయరాంపురంనకు చెందిన దివంగత వైఎస్సార్‌సీపీ నాయకుడు బూరి అప్పలస్వామినాయుడు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు, గ్రామ సర్పంచ్ బూరి మధుసూదనరావు నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఆదివారం స్థానిక వివేకానంద ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు బొత్స అప్పలస్వామినాయుడు, వివేకానంద ట్రస్ట్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



తెర్లాం: నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ బూరి మధుసూదనరావు



వంగర: నిత్యావసర సరుకులు అందిస్తున్న సత్యసాయి సేవాసమితి సభ్యులు

వారికి కనుమ రోజు సంక్రాంతి..

బాడంగి: మండలంలోని పింద్రంగివలసకు చెందిన కర్రి, కొత్తల కుటుంబాల వారు సంక్రాంతి పండుగను కనుమ రోజున జరుపుకుంటారు. మిగిలిన గ్రామస్తులు మూడు రోజులు పండుగ జరుపుకోగా..వీరు మాత్రం అందుకు భిన్నంగా చేసుకుంటారు. గ్రామస్తులందరితో పాటు కర్రి, కొత్తల కుటుంబీకులు భోగి పండుగను జరుపుకుంటారు. మరుచటి రోజు సంక్రాంతి కాగా.. వీరు మాత్రం కనుమ రోజున సంక్రాంతి చేసుకుంటారు. ఆ తర్వాత రెండు రోజుల్లో కనుమ, ముక్కనుమ జరుపుకుంటారు. తమ పూర్వీకుల నుంచి ఈ పద్ధతి వస్తుండడంతో తామూ అలాగే జరుపుకుంటున్నామని ఆయా కుటుంబాల వారు చెబుతున్నారు.



పింద్రంగివలస గ్రామం

రచ్చబండ ప్రారంభం

రేగిడి: మండలంలో ఖండ్యాం గ్రామానికి చెందిన యువత రూ.3 లక్షలతో నాగావళి నదీతీరంలో నిర్మించిన రచ్చబండను పోలేటి వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ కింజరాపు సురేష్‌కుమార్, మాజీ సర్పంచ్ గొలివి జగ్గునాయుడు ఆదివారం ప్రారంభించారు. గ్రామంలోని వృద్ధులు, యువత సేదతీరేందుకు వీలుగా యువకులంతా కలిసి నదీతీరంలో రచ్చబండను నిర్మించడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో బూసి అప్పలనాయుడు, తంగి ప్రసాదరావు, బూసి ప్రసాదరావు, యువత పాల్గొన్నారు.



కొత్తగా నిర్మించిన రచ్చబండ వద్ద గ్రామస్తులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

తెర్లాం: వారంతా 32 ఏళ్ల కిందట ఒకే పాఠశాలలో పదో తరగతి చదువుకున్నారు. చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగాల్లో, వ్యాపారాల్లో స్థిరపడ్డారు. సంక్రాంతి పండగకు సొంత గ్రామాలకు వస్తుండడంతో అప్పట్లో చదివిన పాఠశాలలో వారంతా మళ్లీ ఒకసారి కలుసుకోవాలని నిర్ణయించుకుని గెట్ టుగెదర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే..తెర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991 – 92 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులంతా ఆదివారం 'పూర్వ విద్యార్థుల అపూర్వ కయిక' కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్ననాటి అనుభూతులు, జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సందడి చేశారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను సత్కరించారు.

ప్రతిభ పరీక్షకు విశేష స్పందన



బహుమతులతో విద్యార్థులు

సంతకవిటి: మండలంలోని బొద్దూరు గ్రామంలో 'మేముసైతం' యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు ఆదివారం ప్రతిభ పరీక్ష నిర్వహించారు. ప్రతీ తరగతిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన ముగ్గురికి వరుసగా రూ.1000, రూ.800, రూ.500, కన్సోలేషన్ బహుమతిగా రూ.300లు చొప్పున నగదు అందజేశారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు పార్వతి, వి.సన్యాసినాయుడు, విజయలక్ష్మి, రిటైర్డ్ టీచర్ వి.దామోదరరావు, ప్రకాశరావు, పాగిరి, సంతకవిటి, బొద్దూరు తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న గ్రంథాలయ కమిటీ సభ్యులు

రాజాం సిటీ: మండలంలోని కంచరాం గ్రామంలో ప్రజాగ్రంథాలయ నిర్వహణకు విరాళాలు సేకరించారు. గ్రంథాలయ కమిటీ సభ్యులు ఆదివారం గ్రామంలోని ఇంటింటికీ చందాలు సేకరించారు. ఏటా సంక్రాంతి పండగ సమయంలో చందాలు సేకరించి వచ్చిన నిధులను అన్ని రకాల పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు, న్యూస్ పేపర్ల కొనుగోలుకు, భవన అభివృద్ధికి ఖర్చు చేస్తున్నామన్నారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

వంగర: మండలంలోని ఓనెఅగ్రహారం గ్రామంలో సర్పంచ్ కాబోతుల పార్వతి జ్ఞాపకార్థం నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు హోరా హోరీగా జరుగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కాబోతుల శ్రీనివాసునాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో 20కి పైగా జట్లు పాల్గొన్నాయి. సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నారు.

అలజంగిలో మేలుకొలుపు

బొబ్బిలి: మండలంలోని అలజంగిలో ఆదివారం వేకువజామున మేలుకొలుపు నిర్వహించారు. పురవీధుల్లో భజనలు, భక్తి గీతాలు ఆలపించారు. సమరసత ఫౌండేషన్ డివిజన్ ధర్మ ప్రచారకుడు ధూపం వాసు పాల్గొని ధర్మ ప్రవచనాలను పఠించారు. శ్రీపతి శ్రీనివాస్, వెంకటరమణ పాల్గొన్నారు.

ఘనంగా గోదాదేవి కల్యాణం

బొబ్బిలి: పట్టణంలోని సింగారపువీధిలో కొలువైన వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధర్మకర్త గెంబలి శ్రీనివాసరావు దంపతుల ఆధ్వర్యంలో గోదాదేవి కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గోదాదేవి అలంకారంలో ఓ బాలిక భక్తులను ఆకట్టుకుంది.